BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 25 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## తదుపరి డిజిపిగా సివి ఆనంద్ ?



హైదరాబాద్, ఏప్రిల్ 24 : తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత సీవీ ఆనంద్ మే మొదటి వారంలో బాధ్యతలు స్వీకరించను న్నట్లు సమాచారం. ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ ఉన్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆ స్థానంలో శిఖా గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆనంద్ డిజిపిగా నియాకం ఖరారైనట్లేనని భావిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం



- రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 24 : వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పుటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, వివరాలు 3లో..

## ఆర్టీసీ కార్మికులకు అఖిలపక్షం మద్దతు



- పోరాటం చేయాలే తప్ప ప్రాణాలు తీసుకోవద్దు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు

వివరాలు 2లో..

# ఆర్టీసీ సమ్మెలపై ప్రభుత్వం సానుకూలం

- సమ్మెపై జెఎసితో మంత్రుల చర్చలు
- ఆర్టీసీని బలోపేతం చేద్దామన్న భట్టి



హైదరాబాద్, ఏప్రిల్ 24 : ఆర్టీసీ సమ్మెపై చర్చలు కొలిక్కి వచ్చినట్లేనని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల సానుకూలతతో ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.ఆర్టీసీని మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నమైంది. అప్పటి పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించారో మీకందరికీ తెలుసు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం. ఆర్టీసీకి సంబంధించిన పాలన, విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దాం. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుందామని భట్టి అన్నారు. మొత్తం 32 డిమాండ్లను జేఏసీ నేతలు మంత్రుల ముందు ఉంచారు. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రకటించిన నేపథ్యంలో.. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు గుర్తింపు, పీఆర్సీపై చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బోర్డు పరిధిలోని సమస్యలను యాజమాన్యం, ఉద్యోగులు పరిష్కరించుకోవాలని.. ప్రభుత్వ పరిధిలోని అంశాలను పరిష్కరిస్తామని మంత్రులు తెలిపారు.

## హుగ్లీ నదిలో ప్రధాని విహారం



- బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ

వివరాలు 2లో..

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

- భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక
- టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
- ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



కోల్‌కతా,ఏప్రిల్24 : పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వా మాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభిం చారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. వివరాలు 3లో..

## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

- బిజెపిలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్య సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. వివరాలు 3లో..

## ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత



- శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు
- పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు
- డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న

వివరాలు 2లో..

### 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసు

## కెసిఆర్, కెటిఆర్,హరీష్ రావులపై కేసు కొట్టివేత



హైదరాబాద్,ఏప్రిల్24 : హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యా న్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వివరాలు 3లో..

## ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

- 10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు
- డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం



హైదరాబాద్, ఏప్రిల్ 24 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను వివరాలు 3లో..

## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

### ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

### ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు




హైదరాబాద్, ఏప్రిల్ 24 : రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్త ర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ వివరాలు 3లో..

## నర్సంపేటకు శంకర్‌గౌడ్ మృతదేహం



- వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- బండి సంజయ్‌తో పోలీసుల వాగ్వాదం

వివరాలు 2లో..

## తెలంగాణలో మరో కొత్త పార్టీ

- నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత
- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం



హైదరాబాద్,ఏప్రిల్24: తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబో తున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీ కరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచా రం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు వివరాలు 3లో..

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- సమస్యను పరిష్కరించకుండా కమిటీలతో కాలయాపన
- బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపాటు




హైదరాబాద్,ఏప్రిల్24 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి.. తద్వారా రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చిందన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచి వేసింది.ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మం డలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరం. కాం గ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతోపాటు వారి సమస్యలు పరిష్కరించక పోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైంది. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుం బానికి తగిన పరిహారం చెల్లించాలి. ఆర్టీసీ కార్మికులు ముం దుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం మాత్రం వివరాలు 3లో..

# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం



హైదరాబాద్, ఏప్రిల్ 24 : ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్‌అపోలోఆస్పత్రిలోచికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

- శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు
- పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు
- డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న



వరంగల్,ఏప్రిల్24 : వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోనకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యత్నించారు. దీంతో పోలీసులను వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సహా బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లకుంటే శంకర్ గౌడ్ ఆత్మ శాంతించదని అన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకి శంకర్‌గౌడ్ మృతదేహాన్ని తరలించేదాకా కదిలేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళితే అభ్యంతరం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అనవసరంగా అడ్డుకుని ఎందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపోకు తరలించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళి అర్పిస్తే నష్టమేంటన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. అయితే శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి సూచించారు. 22 ఏళ్లపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్‌గౌడ్ సేవలందించారని, అక్కడికి తీసుకెళితేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# శంకర్ గౌడ్ మృతి విషాదకరం



- ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది
- హరీష్ రావు ఆవేదన

హైదరాబాద్, ఏప్రిల్ 24 : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసింది. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు మా ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలి దానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం. జోహార్ శంకర్ గౌడ్' అంటూ హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.


## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

### కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

కరీంనగర్,ఏప్రిల్24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య.. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన తప్పే.. కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్‌సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే.. ఓటు కాంగ్రెస్‌కు వేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది. ఆ డబ్బులు బఠానీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు' అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి హితవుపలికారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తెలంగాణ నుంచే డబ్బులు వెళున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను ప్రధాని మోదీని అడిగి తయారు చేశారా అంటూ కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలు

- ఎంపిలను బిజెపిలో చేర్చుకోవడంపై ఆప్ విమర్శలు



న్యూఢిల్లీ,ఏప్రిల్24 : కమలం పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆమ్ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చడ్డా ఆ పార్టీకి రాజీనామా చేసి, భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్‌జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. భాజపా తన చర్యలతో మరోసారి పంజాబీలను గట్టి దెబ్బ కొట్టిందని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. కమలం పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. తమ ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి భాజపా ఈడీ, సీబీఐలను వాడుకుందని ఆరోపించారు.ఈ రోజు ఏడుగురు ఆప్ ఎంపీలు భాజపాలో చేరారు. తమను మోసంచేసిన వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. రాఘవ్ చడ్డానుపార్టీ ఎమ్మెల్యే, ఎంపీని చేసి ంది. పంజాబ్ ప్రజలు సందీప్ పాఠక్‌ను ప్రేమతో రాజ్యసభకు పంపారు. రాజేంద్ర గుప్తా, విక్రమ్ సాహ్నీ, అశోక్ మిట్టల్, స్వాతి మాలీవాల్.. వీరం దరికీ పార్టీ, పంజాబ్ ప్రజలు దిగువస్థాయి నుంచి ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం కల్పించారు. వారి ఆశీస్సులవల్లే హర్భజన్‌సింగ్‌కు కూడా పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం లభించింది. కానీ, ఈ ఏడుగురూ రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు' అనిసంజయ్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో తమ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వేటు వేసి.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు చడ్డాతో పాటు అశోక్ మిత్తల్‌సైతంభాజపాలోచేరుతున్నట్లు ప్రకటించడంతో ఆప్‌నకు భారీ ఎదురు దెబ్బ తగిలినట్లైంది.

# శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

- శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్
- మండిపడ్డ అద్దంకి దయాకర్



హైదరాబాద్,ఏప్రిల్24 : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చి పోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు.శంకర్‌గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మి కులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయినఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగాఉంటా మని సర్కార్‌ప్రకటించిందన్నారు.సమస్యనుపరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వవిప్ మండిపడ్డారు. సీఎం,మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దనివిజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులనునమ్మొద్దని..కచ్చితంగా కార్మి కులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దయాకర్ స్పష్టం చేశారు.

# తక్షణం ఆస్తిపన్ను చెల్లించండి

- ఐదుశాతం రాయితీకి మరో నాలుగు రోజుల గడువు



నల్లగొండ,ఏప్రిల్24 : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

# ఆర్టీసీ కార్మికులకు అఖిలపక్షం మద్దతు

- పోరాటం చేయాలే తప్ప ప్రాణాలు తీసుకోవద్దు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు



కొత్తగూడెం,ఏప్రిల్24 : తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్టీసీ సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉందని అన్నారు. ఆర్టీసీ జాబ్ ఆధ్వర్యంలో మూడోరోజు ఉధృతంగా కొనసాగుతున్న సమ్మెలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్మికులు పట్టుదలతో తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలే కానీ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కార్మికుల ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతునిస్తుందని, తానే ముందుండి సమ్మెకు నాయకత్వం వహిస్తానని తెలిపారు. కార్మికులు ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, శాంతియుతంగా సమ్మె నిర్వహించాలని ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం కొత్తగూడెం మేయర్ మూడు గణేలిష్, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జై భీమ్ రావు పార్టీ రాష్ట్ర నాయకుడు యెర్ర కామేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాపన్న నాయకులు మధు, సంజీవ్, సురేందర్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, భారతీయ జనతా పార్టీ నాయకుల తో పాటు పలు పార్టీలకు కార్మిక సంఘాలకు చెందినవారు మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు బి.ఎన్.రావు, నజీర్, భాస్కర్, సరస్వతి, రేణుక, రహంతుల్లా, సైదులు, శేషు, రాటి పాల్గొన్నారు. కాగా మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కు నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటాన్ని ప్రదర్శించారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

- బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ

కోల్‌కతా,ఏప్రిల్24 : ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు.

# వందేమాతరం సామూహిక గీతాలపన

## మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా

## మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్24: గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

# ఆస్పత్రిలో మృతదేహంపై ఆభరాణలు చోరీ

జగిత్యాల,ఏప్రిల్24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ విభాగంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఏల్పుల బాలవ్వ(80) అనే వృద్ధురాలు మృతిచెందగా ఆమె చెవులకు ఉన్న ఆభరణాలు మాయ మయ్యాయి. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల బాలవ్వ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలవ్వ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది.ఆసమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకో వాలని బంధువులకు సూచించాడు.బంధువులు బాలవ్వ మృతికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆసుపత్రి సిబ్బంది నుంచి తీసు కొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారిస్వ గ్రామానికి తరలించారు. ఇంటికి వెళ్లిన తర్వాత చూడగా బాలవ్వ చెవులకు ఉన్న కమ్మలు కనిపించక పోవడంతో వెంటనే ఆమె అల్లుడు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సెక్యూరిటీ గార్డును నిలదీశాడు.అతను తనకుసంబంధం లేదని చెప్పాడు. దీంతో బాలవ్వ అల్లుడు శంకర్ జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# నర్సంపేటకు శంకర్‌గౌడ్ మృతదేహం

- వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- బండి సంజయ్‌తో పోలీసలు వాగ్వాదం

వరంగల్,ఏప్రిల్24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముత్తోజిపేటకు చేరుకుని కేంద్ర మంత్రితో మాట్లాడారు. నర్సంపేట డిపోకు శంకర్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో ముత్తోజిపేటలో పరిస్థితి బండి సంజయ్ వర్సెస్ పోలీసులు అన్నట్టుగా మారింది. శంకర్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించాల్సిన కొడుకు హేమంత్‌ను బీజేపీ నేతలు నర్సంపేట డిపోకు తీసుకెళ్లారు. అయితే శంకర్ గౌడ్ డెడ్ బాడీని తిరిగి కూతురు ఇంటికి తరలించారు పోలీసులు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ అంత్యక్రియలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎట్టిపరిస్థితుల్లో శంకర్ మృతదేహాన్ని డిపోకు తరలించాలని బండి సంజయ్ పట్టుబడుతుండగా.. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు. దీంతో 365 జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అంతకుముందు భారీ కాన్వాయ్‌తో బండి సంజయ్, బీజేపీ శ్రేణులు ముత్తోజిపేటకు చేరుకున్నారు. శంకర్ గౌడ్ మృతదేహానికి కేంద్ర మంత్రి నివాళులర్పించారు. బండి సంజయ్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లనీయకపోవడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమేలాఅండ్ఆర్డర్ ప్రాబ్లమ్ క్రియేట్ చేస్తోందని ఆరోపించారు. మానవతా విలువలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.సంప్రదాయాలను విస్మరిస్తోందని అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నేతలు ఆర్టీసీ కార్మికుల దగ్గరకు వెళ్లి రాజకీయం చేయలేదా అని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లనివ్వకపోతే రేపటి వరకూ బాడీ ఇక్కడే ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం కుటుంబ సభ్యులకైనా మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లే అవకాశం కల్పించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ముత్తోజిపేట నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లిపోయారు. బండి సంజయ్‌తో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు మాట్లాడారు. అంత్యక్రియలవిషయంలో కుటుంబ సభ్యులకు అభ్యంతరం లేకపోతే తనకూ అభ్యంతరం లేదంటూ ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతోశంకర్‌గౌడ్అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

## ఆమ్ఆద్మీ పార్టీకి భారీ షాక్

ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నీ కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

కంట్రోల్‌డీజీగాఅవినాష్‌మొహంతినినియమిస్తూ,ఆయనకుఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతేమల్కాజిగిరిపోలీసుకమిషనర్‌గాబి.సుమతి,కార్తికేయకుఎస్ఐబీఐజీగాఅదనపుబాధ్యతలు అప్పగించారు.

## ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

చేసి, థీమ్‌ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్-అలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1నుంచి12వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని,అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యా చారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది.మేఆమె తల్లిని మాఅభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసు
## కెసిఆర్, కెటిఆర్,హరీష్ రావులపై కేసు కొట్టివేత

వచ్చా యి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీ యంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొ న్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

## తెలంగాణలో మరో కొత్త పార్టీ


చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమ య్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యం

పట్టించుకోక పోవడం అత్యంత దురదృష్టకరం. బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని రామ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, భారతీయ జనతా పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసింది. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం.. కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షానే నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని' ఆ పార్టీ తెలంగాణ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

- వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం
- ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్



**అమరావతి,ఏప్రిల్24 :** చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. -రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

## హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన

- సోషల్ మీడియా ద్వారా యువత టార్గెట్
- మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



**విజయవాడ,ఏప్రిల్24 :** ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా పై అవగాహన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శైలజ నేతృత్వంలో రైల్వే పోలీసులతో కలిసి విజయవాడలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడుకు చెందిన పీఎం నాయక్ హాజరయ్యారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్ అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చుకుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధితులు మానసికంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని.. సోషల్ మీడియాలో అపరిచితులతో సంబంధాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటే ట్రాఫికింగ్‌ను తగ్గించవచ్చని చెప్పారు.

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

- కిల్లర్ పార్టీ నేతలు కొత్త ఎత్తుగడలు
- వారి వ్యూహాలకు తగ్గట్లుగా ఉండాల్సిందే
- ఎంతటి దారుణాలకైనా తెగించేస్తున్నారు
- క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ అధినేత చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 24 :** వైసిపి రాజకీయ కుట్రలతో అప్రమత్తంగా ఉండాలని టిడిపి శ్రేణులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. పార్టీ సిద్దాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల వంటి అంశాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దు తామని...కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశర చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ప్రస్తావించారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. వైసీపీ సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు. 2019లో వైసీపీ గెలిచాక ఏపీలో అభివృద్ధి జరగలేదని ప్రస్తావించారు. తనను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాలను దాటి సామాన్య ప్రజలను కూడా జగన్ హయాంలో ఇబ్బందులకు గురి చేశారని సీఎంచంద్రబాబు ధ్వజమెత్తారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని అన్నారు. మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతోపాటు.. కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని.. పార్టీ కూడా కార్యకర్తలను అలాగే గౌరవిస్తోందని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిందని జగన్ రెడ్డి పరామర్శకు వెళ్తారని... కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారని... కానీ తన కారు కింద పడి పోయిన కార్యకర్తను మాత్రం ఎందుకు పరామర్శించరని ప్రశ్నించారు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారని ఆరోపించారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూములను దోపిడీ చేశారని ఆగ్రహించారు.

## రాజమండ్రి కోర్టు వద్ద ఉత్కంఠ

- ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్
- కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**రాజమండ్రి,ఏప్రిల్24 :** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రాజమహేంద్రవరం కోర్టు ప్రాం గణంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసు మొదటి నుంచీ వివాదాస్పదంగానే కొనసాగుతోంది. తాజాగా బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యంగా కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇప్పటికే అనంతబాబు బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపణలు రావడంతో కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్ట్ చేసే సమయంలో కోర్టు సముదాయం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అరెస్టు అనంతరం అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయనపై తదుపరి విచారణ కొనసాగనుంది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అనంతబాబును స్టేషన్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ ఆయనను విచారించి తదుపరి న్యాయ పక్రియలు చేపట్టనున్నారు. ఈ కేసులో సాక్షులు భయపడేలా చేయడం లేదా కేసు నుంచి వెనక్కు తగ్గించేలా ఒత్తిడి తేవడం వంటి చర్యలు న్యాయపరంగా తీవ్రంగా ఉన్నాయి. అందుకే ఈ ఆరోపణలు నిజమని తేలితే, అనంతబాబుపై కేసు మరింత బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతం అనంతబాబు అరెస్టుతో కేసు మరో మలుపు తిరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెయిల్ రద్దు పిటిషన్‌పై కోర్టు తీసుకునే నిర్ణయం, సాక్షుల వాంగ్మూలాలు, పోలీ సుల దర్యాప్తు కలిసి ఈ కేసు తుది తీర్పును నిర్ణయించనున్నాయి. ఈ కేసు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో, కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే విషయం ఉత్కంఠగా మారింది.

## ఎపిలో ఠారెత్తిస్తున్న ఎండలు



- భానుడి భగభగలతో జనం బెంబేలు
- మరితం ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రఖర్ జైన్

**విజయవాడ,ఏప్రిల్24 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడు భగభగలాడు తున్నాడు. ఏపీవ్యాప్తంగా ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోతతో జనం అల్లాడిపోతుండగా, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తాజాగా మరో హెచ్చరిక జారీ చేశారు. రాబోయే 24 గంటల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో గాలిలో వేడి పెరిగి తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేశాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలో 43.7 డిగ్రీల నమోదైందని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 207 మండలాల్లో ఉష్ణోగ్రతలు 41కంటే ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని, లోతట్టు జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ ఏడాది ఉష్టోగ్రతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రఖర్ జైన్ ఈ జాగ్రత్తలు పాటించాలని కోరారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం ఉత్తమమని తెలిపారు. దాహం వేయకపోయినా తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాని సూచించారు.లేత రంగు గల నూలు దుస్తులు ధరించాలని అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు కట్టుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

# రఘునాథపల్లిలో ఉద్రిక్తత

- సబితా ఇంద్రా రెడ్డి, వినోద్ కుమార్ అరెస్ట్
- నర్సంపేట వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బైఠాయింపు
- ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యపై బీఆర్ఎస్ నిరసన



**బలగం టీవీ, రఘునాథపల్లి**

వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితలను పోలీసులు జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద అడ్డుకున్నారు. వారిని బలవంతంగా అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**పోలీస్ స్టేషన్ ముట్టడి**

బీఆర్ఎస్ అగ్రనేతల అరెస్ట్ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే భారీ సంఖ్యలో కార్యకర్తలతో రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల తీరుకు నిరసనగా స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరగడంతో పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**ప్రభుత్వానిదే బాధ్యత: పల్లా రాజేశ్వర్ రెడ్డి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. శంకర్ గౌడ్ మరణానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. "ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినా, వారికి సంబంధించిన అపాయింట్‌మెంట్ తేదీలను ప్రకటించకుండా కాలయాపన చేయడం వల్లే కార్మికులు మానసిక వేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు" అని ఆయన విమర్శించారు. తక్షణమే మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, కార్మికుల అపాయింట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకుల అరెస్ట్ నేపథ్యంలో రఘునాథపల్లి పరిసరాల్లో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నైనీ బ్లాక్ నుంచి 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం




- సత్తుపల్లి సీహెచ్‌పీ ద్వారా రోజుకు 50 వేల టన్నుల రవాణా జరగాలి
- ఒడిశాలో రవాణా అవరోధాలను అధిగమించాలి
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం
- సింగరేణి భవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సత్తుపల్లి ఏరియా మరియు ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లపై ఆయన ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు.

సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (జనూ)లో ఉన్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎండీ సూచించారు.

లక్ష్యం: ఈ ఆర్థిక సంవత్సరంలో జేవీఆర్-2 ఓపెన్ కాస్ట్ నుంచి 11 మిలియన్ టన్నులు, కిష్టారం ఓపెన్ కాస్ట్ నుంచి 24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలి.

రవాణా: జేవీఆర్ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున 45 వేల నుంచి 50 వేల టన్నుల బొగ్గును వినియోగదారులకు చేరవేయాలని స్పష్టం చేశారు.

**నైనీ బ్లాక్‌పై ప్రత్యేక దృష్టి**

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ ఈ ఏడాది సంస్థకు అత్యంత కీలకమని సీఎండీ పేర్కొన్నారు.

ఉత్పత్తి లక్ష్యం:లిలి ఈ ఏడాది నైనీ బ్లాక్ నుండి 60 లక్షల టన్నుల (6 మిలియన్ టన్నులు) బొగ్గు ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా విధించారు.

రవాణా వ్యూహం:లిలి కోల్ కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోపు, ప్రత్యామ్నాయంగా రోడ్డు మార్గం ద్వారా సమీప రైల్వే సైడింగ్‌లకు బొగ్గును చేరవేయాలని సూచించారు. ఈ విషయంలో స్థానిక ప్రభుత్వం మరియు ప్రజల సహకారాన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**సమీక్షలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ సమావేశంలో నైనీ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ బైద్య గని నిర్వహణకు అవసరమైన సిబ్బంది, అధికారుల వివరాలను నివేదించగా, సత్తుపల్లి ఏజీఎం చింతల శ్రీనివాస్ ప్లాంట్ వినియోగంపై వివరణ ఇచ్చారు. ఈ సమీక్షలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్లానింగ్), ఎం. తిరుమలరావు (ఈ అండ్ ఎం), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై 'ఉపా' అస్త్రం..

- రేవంత్ సర్కార్‌ది అణిచివేత ధోరణి
- నిజాలు చెబుతున్న సోషల్ మీడియాపై ఉక్కుపాదం
- తెలుగు స్క్రైబ్‌పై కుట్రపూరితంగా కేసులు
- ఆర్టీసీ కార్మికుడి మృతికి ప్రభుత్వానిదే బాధ్యత
ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టుల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం పోలీసు యంత్రాంగాన్ని, ఇంటెలిజెన్స్ సంస్థలను వాడుకుంటోందని ఆరోపించారు.

కేవలం టెర్రరిస్టులపై ప్రయోగించాల్సిన లిలిఉపా (ఖుూరాూ)లిలి చట్టాన్ని నేడు జర్నలిస్టులపై ప్రయోగిస్తున్నారని ఆయన విమర్శించారు. "తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులు 'తెలుగు స్క్రైబ్' వంటి పాపులర్ సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై కుట్రపూరితంగా ఫిర్యాదులు చేస్తున్నారు. 90 శాతం మంది ఐపీఎస్ అధికారులకే తెలియని 'కౌంటర్ ఇంటెలిజెన్స్' (జక్మీ) సంస్థ పేరుతో లేఖలు రాయడం వెనుక ఆంతర్యమేమిటి?" అని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు చేరవేస్తున్న వారిపై 70కి పైగా కేసులు బనాయించి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు.

నర్సంపేట ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణాన్ని ఆయన 'ప్రభుత్వ హత్య'గా అభివర్ణించారు. కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే, వారికి టెంట్ హౌస్ సామాన్లు, నీళ్లు ఇచ్చిన వారిపై కూడా కేసులు పెడతామని పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఈ అణిచివేత ధోరణి వల్లే మనస్తాపానికి గురైన శంకర్ గౌడ్ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమయాత్రకు వెళ్తున్న సబితా ఇంద్రా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ వంటి నేతల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు.

రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1) ప్రకారం జర్నలిస్టులకు ఉన్న హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. "సోషల్ మీడియాపై కేసులు పెట్టే విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఎనిమిది మార్గదర్శకాలను పక్క రాష్ట్రం కర్ణాటక అమలు చేస్తోంది, కానీ తెలంగాణలో మాత్రం ఉల్లంఘిస్తున్నారు" అని దుయ్యబట్టారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న అధికారులపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని సూచించారు.

'హైడ్రా' పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు లేవు. గాంధీ ఆసుపత్రిలో శిశువుల మరణాలను ప్రశ్నిస్తే తీవ్రవాదం అంటారా? కాళేశ్వరం ఇసుక మాఫియాను ఎండగడితే కేసులు పెడతారా? కొణతం దిలీప్, క్రిశాంక్ వంటి వారిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారు.' అని అన్నారు. నేడు 'తెలుగు స్క్రైబ్' మీద ప్రయోగిస్తున్న ఈ అస్త్రాలు రేపు ప్రధాన స్రవంతి మీడియా సంస్థలపై కూడా రావచ్చని, జర్నలిస్ట్ లోకం ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలి.. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు

- పోరాటాలతోనే హక్కుల సాధన
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- శంకర్ గౌడ్ మృతి పట్ల సీపీఐ తీవ్ర సంతాపం



**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావని, పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని ఆయన పిలుపునిచ్చారు. నర్సంపేట డిపో కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం సేవలందించే ఆర్టీసీ కార్మికులకు తగిన గౌరవం, వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పక్కన పెట్టడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే మరిన్ని ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

సిపిఐ తరపున ప్రధాన డిమాండ్లు:

పెండింగ్ సమస్యలు: ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

భరోసా కల్పించాలి: కార్మికులకు ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలి.

ఆర్థిక సాయం: మృతి చెందిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం భారీ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

ఆర్టీసీని బలోపేతం చేయడం, కార్మికుల సంక్షేమాన్ని చూడటం ప్రభుత్వ బాధ్యత అని నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సిపిఐ తరపున ఆయన డిమాండ్ చేశారు.


# మే 5 నుంచి 21 వరకు ఎస్‌వీకేలో సమ్మర్ క్యాంప్

- ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయ కుమార్, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగించుకోవాలని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయ కుమార్, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. సమ్మర్ క్యాంప్‌కు సంబంధించిన పోస్టర్‌ను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌వీకే కార్యదర్శి మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ మే 5 నుంచి 21 వరకు ఉంటుందని తెలిపారు. వేసవి సెలవుల్లో మన పిల్లల పిల్లల నైపుణ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం కోసం సరదాగా, సజనాత్మకంగా పాటలు, ఆటలు, కథలు చెప్పటం, చిత్రలేఖనం, సైన్స్ ప్రయోగాలు, మంచి అలవాట్లు, చెడు అలవాట్లపై అవగాహన, ఆరోగ్య విషయాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చి చివరి రోజున విజ్ఞాన యాత్ర (ఫీల్డ్ ట్రిప్)కు తీసుకెళ్తామని తెలిపారు. ఈ 16 రోజులు నేర్చుకున్న ప్రతిభాపాటవాలని మే 21న ఉదయం నుంచి సాయంత్రం వరకు తల్లిదండ్రులకు చూపించే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బాలోత్సవం అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ గత 4 ఏండ్లుగా నిర్వహిస్తున్నామని, నిరుపేద విద్యార్థులను మొబైల్ ఫోన్, టీవీల నుంచి దూరంగా ఉంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం, మూఢనమ్మకాల నుంచి దూరంగా ఉంచి శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు, విద్యార్థులు 9700888972, 9059752223 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఆఫీస్ సెక్రటరీ బ్రాహ్మణి, కమిటీ సభ్యులు మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు గోపాలరావు కన్నుమూత



**పుస్తక రంగానికి తీరని లోటు: కవి యాకూబ్, మలుపు బాల్ రెడ్డి సంతాపం**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సోము గోపాలరావు (90) ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, గురువారం నాడు కొండాపూర్‌లోని తన కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సాహిత్య లోకం మరియు పుస్తక ప్రేమికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

1986లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీని స్థాపించడంలో గోపాలరావు కీలక పాత్ర పోషించారు. నగరంలో జరిగిన మొట్టమొదటి పుస్తక ప్రదర్శనకు సమన్వయకర్తగా వ్యవహరించి, దాని విజయానికి బాటలు వేశారు. 'సైంటిఫిక్ సర్వీసెస్' అనే సంస్థ ద్వారా దశాబ్దాల పాటు పుస్తక రంగానికి ఆయన విశేష సేవలు అందించారు. అనేక పుస్తక ప్రదర్శనల నిర్వహణలో ఆయన అనుభవం, మార్గదర్శకత్వం ఎనలేనివని సన్నిహితులు గుర్తుచేసుకున్నారు.

గోపాలరావు మృతి పట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ కవి యాకూబ్, ఉపాధ్యక్షులు మలుపు బాల్ రెడ్డి, కార్యదర్శి ఆర్. వాసు, కోశాధికారి నారాయణ రెడ్డి మరియు కార్యనిర్వాహక వర్గం ఘనంగా సంతాపం ప్రకటించారు. పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గోపాలరావు భౌతిక కాయాన్ని ఏప్రిల్ 26 (ఆదివారం) నాడు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఆయన స్వగృహానికి తరలించనున్నారు. మిత్రులు, అభిమానుల సందర్శనార్థం అక్కడ ఉంచిన అనంతరం, అదే రోజు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రైతులకు మేలు చేసేలా భూభారతి చట్టాన్ని సవరించాలి

- తెలంగాణ రైతు సంఘం మహాసభలో తీర్మానం

**బలగం టీవీ, హైదరాబాద్**

-రైతులకు ప్రయోజనం చేకూరేలాగా భూభారతి చట్టాన్ని మార్చాలని తెలంగాణ రైతు సంఘం మహాసభ తీర్మానించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో గల సామినేని రామారావు నగర్ లోని కాసాని ఐలయ్య ప్రాంగణం లో జరుగుతున్న మహాసభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పల్లెపు వెంకటేష్ ప్రతిపాదించగా మరో రాష్ట్ర నాయకులు పి.సుధాకర్ బలపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధరణి చట్టంలో డిజిటలైజేషన్ లోపాల వల్ల 12 లక్షల మంది రైతులకు పట్టా పుస్తకాలు రాలేదని చెప్పారు. దీంతో వారు ఏ పథకాలకూ నోచుకోలేకపోతున్నారని వాపోయారు. ధరణి చట్టం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినా రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టాదారు పాస్ పుస్తకాల్లో సాగుదారుని కాలం పెట్టకపోవడం దారుణమన్నారు. భూభారతి చట్టంలోని లోపాలను సరిచేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



## చెరువుల పునరుద్ధరణకు పటిష్ట వ్యవస్థ: మంత్రి ఉత్తమ్‌కు కోదండరెడ్డి నివేదిక

- చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటుకు ప్రతిపాదన
- నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా 'డిసిల్టింగ్' చర్యలు
- రైతు సంక్షేమ కమిషన్ సమగ్ర నివేదిక సమర్పణ

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని చిన్నపాటి సాగునీటి వనరుల పునర్వ్యవస్థీకరణ, చెరువుల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ కీలక అడుగు వేసింది. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలో రూపొందించిన సమగ్ర నివేదికను శనివారం గౌరవ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కమిషన్ సభ్యులు అందజేశారు.

చెరువుల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాలపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా సాగునీటి, వ్యవసాయ శాఖల అధికారులు, వాలంతారి (ఔూూూమీూక్ష్మక్మీ) ప్రతినిధులు మరియు నిపుణులతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ చర్చల్లో వచ్చిన సూచనల ఆధారంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను రూపొందించారు.

పరిరక్షణ కమిటీలు: ప్రతి చెరువు రక్షణ కోసం స్థానిక నిపుణులు, రైతులతో కూడిన ప్రత్యేక పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలి.

మట్టి తొలగింపు చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు శాస్త్రీయ పద్ధతిలో పూడిక తీత పనులు చేపట్టాలి.

వ్యవస్థాగత మార్పులు: చిన్నపాటి సాగునీటి వనరుల నిర్వహణలో స్థిరమైన వ్యవస్థను తీసుకురావాలి.

ఈ సందర్భంగా కమిషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ మరియు నీటి వినియోగం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నివేదికపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కేవీ నర్సింహ రెడ్డి, భవాని మరికంటి, గడుగు గంగాధర్, సునీల్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## నేను క్యాన్సర్‌ను జయించాను: నెతన్యాహు

- గోప్యంగా చికిత్స.. ఇప్పుడు పూర్తి ఆరోగ్యం
- యుద్ధం కారణంగానే అనారోగ్య విషయం దాచానన్న ఇజ్రాయెల్ ప్రధాని
- ప్రారంభ దశలోనే గుర్తించి రేడియేషన్ థెరపీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు (76) ఒక సంచలన విషయాన్ని వెల్లడించారు. తనకు ప్రోస్టేట్ క్యాన్సర్ సోకిందని, అయితే దానిని ప్రారంభ దశలోనే గుర్తించి విజయవంతంగా చికిత్స తీసుకున్నానని ఆయన అధికారికంగా ప్రకటించారు. తన వార్షిక వైద్య నివేదిక విడుదల సందర్భంగా శుక్రవారం ఆయన ఈ వివరాలను పంచుకున్నారు.

ఇరాన్‌తో తీవ్రమైన యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో తన అనారోగ్యం శత్రువులకు ఆసరాగా మారకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని ఇంతకాలం గోప్యంగా ఉంచినట్లు నెతన్యాహు వివరించారు. "నా అనారోగ్యాన్ని సాకుగా చూపి ఇరాన్ తప్పుడు ప్రచారం చేసే అవకాశం ఉంది. అందుకే యుద్ధ సమయంలో దీనిని బయటపెట్టలేదు. ఇప్పుడు నేను పూర్తి ఆరోగ్యంతో ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు.

ఏడాదిన్నర క్రితం ప్రోస్టేట్ శస్త్రచికిత్స చేయించుకున్నప్పటి నుండి నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు నెతన్యాహు తెలిపారు.

కణితి గుర్తింపు:లిలి ఇటీవలి పరీక్షల్లో 0.9 సెం.మీ. పరిమాణంలో ఒక చిన్న కణితిని వైద్యులు గుర్తించారు.

రేడియేషన్ థెరపీ:లిలి అది ప్రారంభ దశ క్యాన్సర్ అని నిర్ధారణ కావడంతో, వైద్యుల సలహా మేరకు రేడియేషన్ థెరపీ తీసుకున్నట్లు వెల్లడించారు.

పూర్తిగా నయం:లిలి చికిత్స తర్వాత క్యాన్సర్ కణాలు పూర్తిగా తొలగిపోయాయని, ఇతర భాగాలకు వ్యాపించలేదని వైద్య నివేదికలు ధృవీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ చరిత్రలోనే అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా నెతన్యాహు రికార్డు సృష్టించారు. 76 ఏళ్ల వయస్సులోనూ ఆయన చురుగ్గా ఉంటూ దేశాన్ని నడిపిస్తున్నారు. "వ్యక్తిగతమైనా, వృత్తిపరమైనా సమస్య వచ్చినప్పుడు వెనకడుగు వేయకుండా వెంటనే పరిష్కరించుకోవడం నా నైజం. క్యాన్సర్ విషయంలోనూ అదే చేశాను" అని నెతన్యాహు తన సోషల్ మీడియా ఖాతాలో రాసుకొచ్చారు.



## వేములవాడ రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు..

**బలగం టీవీ, వేములవాడ :**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు.

తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.

కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కవ్వంపల్లికి శ్రీ సీతాలమ్మ మాడలేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానం

**బలగం టీవీ,ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహించనున్న శ్రీ సీతాలమ్మ మాడలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల ఆహ్వాన పత్రికను మానకొండూరు శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు రజక సంఘం నాయకులు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు, ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమ విశేషాలను వివరించి అధికారికంగా ఆహ్వానించారు. ఈ ఉత్సవాలు మే 06-05-2026 బుధవారం ప్రారంభమై, 09-05-2026 శుక్రవారం వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు.?ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు ముస్కానిపేట సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఇల్లంతకుంట సర్పంచ్ ఎం. రాజు, మాజీ ఎంపీపీ వుట్కూరి రమణ రెడ్డి, యువజన సంఘాల అధ్యక్షుడు రేగుల కార్తీక్, వార్డు సభ్యులు అంతటి శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒగ్గు రమేష్, చిట్టి ప్రదీప్ రెడ్డి, ఒగ్గు మధుతో పాటు గ్రామ రజక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి రవీందర్, నాయకులు దుర్శెట్టి బాలయ్య, సిరికొండ దేవయ్య, లింగంపల్లి లింగం, సిరికొండ బాలరాజు, అంతగిరి శ్రీనివాస్, అంతగిరి హరికృష్ణ, లింగంపల్లి అజయ్, లింగంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రం ఏర్పాటు

**బలగం, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య మరియు ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు మరియు గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు,

ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ: ఎండలు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు, ప్రయాణికుల తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు,గ్రామ ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్ మరియు గ్రామ వార్డు సభ్యులు దమ్మ వెంకట రమణ,జోగు శంకర్,కొంకటి సతీష్,గోల్కొండ సూరి,దయ్యాల రేణుక,సుంకపాక హేమలత,పోలె శేఖర్,పైండ్ల అనిల్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్,మార్కెట్ డైరెక్టర్ కల్లేపల్లి సతీష్,ఏనుగుల అనిల్ కుమార్,గ్రామాధ్యక్షుడు సాగరం కనకయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## లింగన్నపేటలో అట్టహాసంగా 'హిందూ విరాట్ సమ్మేళనం'

- **హిందూ ధర్మం మతం కాదు.. ఒక జీవన విధానం: రిఫ్లెక్షన్ ఛానల్ అధినేత ఆమోగ్ దేశపతి**

**బలగం టీవీ, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో హిందూ విరాట్ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ బస్టాండ్ ప్రాంతంలోని రంగనాయక ఫంక్షన్ హాల్‌ను వేదికగా చేసుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎనిమిది గ్రామాల నుండి హిందూ బంధువులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లింగన్నపేట ఉప మండలం పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో సమ్మేళనం ప్రాంగణం జనసందోహంగా మారింది.భరతనాట్యం, పాటలతో నృత్య ప్రదర్శన స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచినది, అంతేకాకుండా భవద్గీత శ్లోకాలు, సామూహిక హనుమాన్ చాలీసా కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ?ఈ సమ్మేళనానికి హిందూ సమ్మేళన అధ్యక్షులు వ్యాసోజ్జుల రాధాకృష్ణ శర్మ అధ్యక్షత వహించగా,?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిఫ్లెక్షన్ ఛానల్ అధినేత శ్రీ ఆమోగ్ దేశపతి హాజరై మాట్లాడుతూ హిందూ ధర్మం అనేది కేవలం ఒక మతం కాదని, అది ఒక ఉన్నతమైన జీవన విధానమని అన్నారు. భారతదేశం తన సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోందని, అటువంటి గొప్ప హిందూ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. మన సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని ఆయన కోరారు.కరీంనగర్ విభాగ్ సంపర్క ప్రముఖ్ ఎమ్మనేని అశోక్ రావు , వీరితో పాటు ఎనిమిది గ్రామాల సర్పంచ్‌లు, వివిధ హిందూ సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో హిందూ సోదరులు పాల్గొన్నారు .

# మావోయిజం అంతమైంది..

- **ఇక ప్రజలే కేంద్రంగా పోలీస్ సేవలు..**
- **రాష్ట్రంలో 'సిటిజన్ ఫ్రెండ్లీ' పోలీసింగ్..**
- **కుటుంబం కోసం హెల్మెట్ ధరించండి**
- **డీజీపీ బి. శివధర్ రెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందని, ఇకపై ప్రజల అవసరాలే కేంద్రంగా 'సిటిజన్ ఫ్రెండ్లీ' పోలీసింగ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు . పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు . వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు




కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నానని అన్నారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి,అన్ని సెలవుల్లో విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ తాను నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని అన్నారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని అన్నారు . వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు.రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మినిస్టర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం 10 గుంటల స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని అన్నారు.

ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని అన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ అధికారులు సుందర్, రాజశేఖర్, వినేయ్ , సుదర్శన్,సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డి మాటలకు నవ్వాలో ఏడవాలో అర్థం కావట్లేదు..

- **జీవన్ రెడ్డి నాడు కేసీఆర్ పై పోరాటం.. నేడు వత్తాసా...**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎవరి మెప్పు పొందడం కోసమో జీవన్ రెడ్డి వాస్తవ విరుద్ధంగా మాట్లాడుతున్నారని, జీవన్ రెడ్డి మాటలు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ నిన్నటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు దోపిడీ చేసిందని ఆరోపించిన జీవన్ రెడ్డి, నేడు అదే బిఆర్ఎస్ గూటికి చేరగానే మాట మార్చడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు .?కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి గోస్ కమిషన్ ఇచ్చిన నివేదికపై జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని,హైకోర్టు తీర్పును ఆయన సరిగ్గా చదవలేదని, కోర్టు ఎక్కడా కమిషన్ నివేదికను తప్పుపట్టలేదని అన్నారు . కేవలం సాంకేతిక అంశాలను ప్రస్తావించిందే తప్ప, నివేదికలోని వాస్తవాలను కాదనలేదని అన్నారు . అసలు ప్రాజెక్టు ద్వారా ఎన్ని టీఎంసీల నీటిని అందించారో ఇప్పటివరకు లెక్కలు ఎందుకు చెప్పలేదని అన్నారు . నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారమే ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, వారి అనుమతి లేకుండా పనులు చేపట్టడం సాధ్యం కాదని అన్నారు . దెబ్బతిన్న మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తెస్తామని, అలాగే తమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మించి తీరుతామని అన్నారు.

?అవినీతిపై విచారణ అంటేనే బిఆర్ఎస్ నేతలు వణికిపోతున్నారని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించగానే కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి పరుగులు తీసి బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనను



చూసి ఎవరు భయపడుతున్నారో గత ఎన్నికల ఫలితాలే నిరూపించాయని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, గతంలో ఇదే పథకాలను మెచ్చుకున్న జీవన్ రెడ్డి ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని విమర్శిస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసమైందని, అటువంటి వ్యవస్థను బాగు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని అన్నారు . ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పోరాటానికి 'గులాబీ' అండ..



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ సంఘీభావ ర్యాలీ..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

తెలంగాణలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా, వరంగల్ జిల్లా నర్సంపేటలో కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపిందగా,ఈ నేపథ్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శంకర్ గౌడ్ స్మారకార్థం మరియు కార్మికుల పోరాటానికి మద్దతుగా బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుండి ఆర్టీసీ డిపో వరకు సాగిన ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన కుటుంబానికి బీజేపీ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.?ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ శంకర్ గౌడ్ మరణం కేవలం ఆత్మహత్య మాత్రమే కాదని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యేనని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం వల్లే ఇలాంటి బలిదానాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా తక్షణమే పరిష్కరించాలని, పంతాలకు పోకుండా వారి డిమాండ్లను ఆమోదించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కార్మికుల పోరాటంలో బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు . ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు మరియు ఆర్టీ సి కార్మికులు పాల్గొన్నారు.




- **వేములవాడ డిపో వద్ద బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**బలగం టీవీ, వేములవాడ**

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వేములవాడ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి హాజరై తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ?సమ్మె కొనసాగుతుండగా డిపో వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మహిళా కండక్టర్ రమాదేవి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోవడంతో తోటి కార్మికులు, నాయకులు ఆందోళనకు గురయ్యారు. తక్షణమే స్పందించిన తోటి కార్మికుల ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లిన మనోహర్ రెడ్డి, పార్టీ నాయకులు రమాదేవి అఱ పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

?ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాసాల శ్రీనివాస్-లావణ్య, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి చందు, మారం కుమార్, కొండ కనకయ్య, జోగిని శంకర్, నీలం శేఖర్, కందుల క్రాంతి, రేగుల రాజేశం, నిమ్మశెట్టి రాజు, పబ్బ మహేష్, ప్రేమ్ చారి, అంజత్ పాషా, గుడిసె దేవరాజు, రాకేష్, సందీప్, రాజు, కనకయ్య మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యతో ప్రభుత్వంపై బీఆర్ఎస్వీ ఆగ్రహం..

- **మాజీ మంత్రుల అరెస్ట్‌కు నిరసనగా సిరిసిల్లలో భారీ ఆందోళన**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని కలిగించిందని, బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం తీవ్రంగా ఖండనీయమని టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ.. శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పడానికి వెళ్లిన ప్రజా ప్రతినిధులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. "ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా ఇంద్రమ్మ రాజ్యం?" అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజల పక్షాన నిలిచే నాయకులను అణచివేయడానికి పోలీసులు వినియోగించడం దుర్మార్గమని ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరెల్లి వినయ్ కుమార్, మాగంటి కిరణ్, మల్యాల ప్రవీణ్, సాదుల్ల శేఖర్, హైదర్, శశి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హిల్ట్ పాలసీ

- పరిశ్రమలను ఓఆర్ఆర్‌కు అవతల తరలించే ప్రతిపాదన
- నగరంలో కాలుష్యరహిత వాతావరణం కోసం కృషి
- చైనా తరహాలో ఇండస్ట్రియల్ బ్లాక్ అభివృద్ధి
- భూములు ధరలను పెంచడానికి నిర్ణయం
- కేబినేట్ సబ్‌కిటీ భేటలో డిప్యూటి సిఎం భట్టి



**బలగం టీవీ, హైదరాబాద్**

సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. సవరించిన మార్కెట్ విలువలను అమలు చేయాలని నిర్ణయించింది. మే మొదటి వారం నుంచి రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెరగనున్నాయి. పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ హిల్ట్ పాలసీ అమలుకానున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ తెలిపింది. ఓఆర్ఆర్ బయట ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఆదాయ సమీకరణపై అశ్రద్ధ వహిస్తే వేటు తప్పదని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ హెచ్చరించింది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల వసతి కోసం డార్మెటరీలు తప్పనిసరి చేసింది. కాగా, రాష్ట్రంలో వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్ఠంగా రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎకరాకు 6 లక్షల రూపాయలుగా ఉన్న విలువ 12 లక్షల రూపాయల నుంచి 18 లక్షల రూపాయల వరకు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాదు నగరం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ తీసుకువచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు.

పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో కాలుష్యకారక పరిశ్రమలు అన్నిటిని ఓఆర్ఆఆర్ అవతలికి తరలించాలని కంపల్సరీ చేస్తే అందరూ వెళ్ళిపోతారని కొందరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధులు స్వయంగా చెప్పినప్పటికీ, మేం అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్య పద్దతిలో ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద భూములను అభివృద్ధి చేసే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఇండస్ట్రియల్ పార్కుల ప్రతినిధులు కలిసి అభివృద్ధి చేసుకునే ఆలోచన చేయాలి అన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తే మంచిదని, చైనా తరహాలో ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు సూచించారు ఈ సూచనలను స్వాగతిస్తున్నాం, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన తమకు లేదని నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ లక్ష్యం అన్నారు. ఓ.ఆర్.ఆర్ లోపల ఉన్న అన్ని ఇండస్ట్రియల్ అసోసియేషన్ తో కూర్చొని చర్చించి పాలసీ అమలును వేగవంతం చేసుకుందాం అని డిప్యూటీ సీఎం సూచించారు. పాలసీ గైక్మీ-లడైన్స్ రూపొందించే ముందు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధుల ఆలోచనలకు చోటు కల్పించే ప్రయత్నం చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

రాష్ట్రంలో పరిశ్రమలు బాగా నడవాలి, కాలుష్యం ఉండకూడదని, పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం చాలా ఓపెన్ గా ఉందని కమిటీ సభ్యుడు మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల కోసం డార్మెటరీలు తప్పనిసరి చేశామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హిల్ట్ పాలసీని స్వాగతిస్తున్నామని చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం మేము ఉంటున్న భూములను 30 సంవత్సరాల క్రితమే ఆనాటి ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశామని వివరించినట్టు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ఎంఎస్‌పి భారాన్ని రాష్ట్రాలపై మోపొద్దు



- ప్రకటించిన పంటలన్నింటిని కేంద్రమే కొనాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- వానాకాలంలో సాగు చేసే సన్న వరిరకాలపై సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పి ప్రకటించి, పంటలను కొనే బాధ్యతను మాత్రం రాష్ట్రాలపై వేస్తుందని మంత్రి తుమ్మల అన్నారు. దీంతో రాష్ట్రంపై అధిక భారం పడుతుందని తెలిపారు. ఎంఎస్‌పి ప్రకటించిన ప్రతి పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. సచివాలయంలో వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి మరియు కమిషన్ సభ్యులతో సమావేశమైన మంత్రి తుమ్మల, వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అందుబాటులో ఉంచాల్సిన వరి రకాల ఎంపిక, విత్తన లభ్యత, సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం వివిధ రకాలను సిద్ధం చేసినట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత సంవత్సరం 33 రకాల సన్న రకాలను అందుబాటులో ఉంచడం వలన రైతులు అమ్మకాల సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు, కొన్నింటికి బోనస్ కూడా రాకుండా ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు.

## శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం

# భద్రతా ప్రమాణాలపై ఎన్‌జిఆర్ఐ నివేదిక

- కాళేశ్వరంలోనూ భాగస్వామ్యం కావాలన్న మంత్రి ఉత్తమ్



**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాలలో అనుకరించాల్సిన భద్రతా ఏర్పాట్లపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమగ్రంగా రూపొందించిన నివేదికను శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్ర వేత్త సత్యనారాయణ అందించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్.జి.ఆర్.ఐ సంస్థను అభినందించడంతో పాటు ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతితో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో బాగమైన మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల బ్యారేజ్ ల పునరుద్ధరణకు గాను ఎన్.జి.ఆర్.ఐ ఆధ్వర్యంలో భూపరిశోధన( సాయిలు టెస్ట్) భాగస్వామ్యం కావాలన్నారు. శుక్రవారం రోజు డాక్టర్ బి.ఆర్.అ ంబేద్కర్ సచివాలయంలో ఈ మేరకు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఇ ఎన్ సి రమేష్ బాబు సొరంగ మార్గం తవ్వకాల నిపుణుడు పరిక్షిత్ మెహ్రా,ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగాఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదిక పై అయన మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకే తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఎన్.జి.ఆర్.ఐ తో సమగ్రంగా సర్వే నిర్వహినట్లు ఆయన తెలిపారు.

వ్వకాల సమయంలో ముందస్తుగా ప్రమాదవకాశాలను గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థ సీస్మిక్ ఇమేజింగ్,ఎలక్ట్రికల్ రెసిస్టివిటి టొమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వివరించారు. సొరంగ మార్గం తవ్వకాలలో కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రాధాన్యతాంశంగా పెట్టుకుందన్నారు. అందుకు తగినట్లు గానే ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తల మార్గదర్శనానికి అనుగుణంగానే సొరంగ మార్గం తవ్వకాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదిక లో స్ట్రెస్ జోన్ లు,నీటి ఊరట లతో పాటు సొరంగమార్గం పై భాగం తదితర అంశాల పై ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తలు సమగ్రంగా అధ్యయనం జరిపారని ఆయన తెలిపారు.ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ పనుల పై ఆయన మాట్లాడుతూ వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ లోడర్లు,భారీ డంపర్ల తోడ్పాటుతో ఇప్పటి వరకు 151.50 మీటర్ల తవ్వకం పూర్తి అయిందన్నారు. దేశీయ,అంతర్జాతీయంగా సంస్థల నుండి ఆధునిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాంగాన్ని సమీకరించి రెండు వైపులా నెలకు 200 మీటర్ల వరకు తవ్వకాలు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలి..



- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. వేములవాడ మండలం అనుపురం, బోయినపల్లి మండలం విలాసాగర్, జగ్గారావుపల్లి, కొదురుపాకలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

రైస్ మిల్లుల్లో తనిఖీ

బోయినపల్లి మండలం విలాసాగర్ లోని సస్య లక్ష్మి, స్వస్తిక్ ఇండస్ట్రీస్, జగ్గారావుపల్లిలోని సుహాస్ ఆగ్రో రైస్ మిల్లును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# మునగాల కొండపై పెద్దపులి

- గుర్తించిన అటవీ అధికారులు

**బలగం టీవి, కాకినాడ**

తూర్పు గోదావరి జిల్లాలోని మునగాల కొండపై పెద్దపులి సంచరిస్తోంది. పెద్దపులి గురువారం రాత్రి శ్రీరంగపట్నం చెరువులో ఈదుకుంటూ మునగాల కొండపైకి చేరింది. మునగాల కొండపై పెద్దపులి సంచారంపై జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. పెద్దపులి కదలికలను మూడు టీంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ఒక టీం, రాజమండ్రిలో ఉన్న ఒక టీం, మత్తు డాక్టర్ల టీం ఆధ్వర్యంలో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'థర్మల్ డ్రోన్ ద్వారా చీకట్లో కూడా పులి కదలికలను తెలుసుకుంటున్నాము. రెండు రోజుల క్రితం కాపవరం పాండవుల కొండ దగ్గరికి వచ్చిన మార్గంలోనే పులి ప్రయాణం కొనసాగిస్తోంది. పెద్దపులి మొదటిసారి జిల్లాలోకి వచ్చినప్పుడు ప్రజలను కంట్రోల్ చేయడానికి కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం పులి కొండపై ఉండటంవల్ల ఇబ్బంది లేదు'.. పెద్దపులి పశువులపైనే దాడి చేస్తోంది. మనుషులకు హాని చేయటం లేదు. పెద్దపులి నాలుగు రోజులకు ఒకసారి జంతువులను వేటాడి తింటుంది. పెద్దపులి ప్రస్తుతం ఆకలితో ఉంది. దానికి ఆహారంగా కొన్ని పశువులను సిద్ధంగా పెట్టాం. పులిని బంధించేందుకు రెండు బోన్లను కూడా సిద్ధంగా ఉంచాం' అని తెలిపారు.



# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత

- 4.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత

**బలగం టీవి, కరీంనగర్**

ఉత్తర తెలంగా భగ్గుమంటోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత శుక్రవారం పెద్దపల్లి జిల్లా అకెనపల్లిలో రికార్డయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.1, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్టులో 43.8, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల అయిదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల స్థాయిలోనే నమోదవుతాయని, కనిష్ఠంగా రాత్రి ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీలకు పెరుగుతాయని జగిత్యాల పరిశోధనకేంద్రం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలో తేమ ఉదయం 30-50 శాతం, మధ్యాహ్నం 10-15 శాతం వరకు ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని చెప్పారు.




# పేటీఎంకు ఆర్‌బిఐ షాక్

- పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గట్టి షాకిచ్చింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ కింద ఇకపై కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఇప్పటికే గత కొంతకాలంగా ఈ బ్యాంక్‌పై ఆర్బీబీ కఠిన చర్యలు తీసుకుంటూ వస్తోన్న సంగతి తెలిసిందే. కొత్త కస్టమర్లను చేర్చుకోవడం, డిపాజిట్లు స్వీకరరించడం వంటి కార్యకలాపాలపై ముందుగానే నిషేధం విధించింది. 2022లో ప్రారంభమైన ఈ నియంత్రణ చర్యలు.. 2024లో మరింత కఠినంగా మారాయి. డిపాజిటర్లు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా బ్యాంక్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తోందని, పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను నిబంధనలను అనుసరించడం లేదని ఆర్‌బీఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంక్‌ను కొనసాగించడం వల్ల ప్రయోజనం లేదని తేల్చిన ఆర్‌బీఐ.. లైసెన్స్‌ను రద్దు చేసింది. బ్యాంకింగ్ సేవల మూసివేతపై హైకోర్టులో దరఖాస్తు చేస్తామని ఆర్‌బీఐ వెల్లడించింది. అయితే బ్యాంక్ వద్ద ఉన్న నిధులు డిపాజిటర్లకు చెల్లించడానికి సరిపోతాయని భరోసా ఇచ్చింది. మొత్తానికి డిజిటల్ఫైనాన్స్ రంగంలో ఈ పరిణామం పెద్ద షాక్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో వినియోగదారులు, పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



# తెలంగాణ ఔషధ రంగానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఇండియా ఫార్మా ఎక్స్‌పో--2026

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఇండియా ఫార్మా ఎక్స్‌పో--2026 కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ఫార్మా మరియు అనుబంధ సంస్థల స్టాళ్లను పరిశీలించిన మంత్రి, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఔషధ రంగానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాష్ట్రం ఫార్మా, ఆరోగ్య రంగాల్లో అగ్రగామిగా నిలిచి ప్రపంచానికి నాణ్యమైన మందులు, వ్యాక్సిన్లు అందిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణలో 1500కు పైగా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రిడియెంట్స్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, మెడికల్ పరికరాల తయారీ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే 80కుపైగా పరీక్షా కేంద్రాలు, 50 వేలకుపైగా మెడికల్ షాపులు రాష్ట్రంలో ఉన్నాయని వివరించారు.

కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో తెలంగాణ ప్రపంచానికి మందులు, వ్యాక్సిన్లు సరఫరా చేసి తన సామర్థ్యాన్ని నిరూపించుకుందని, హైదరాబాద్ ఔషధ తయారీ, చికిత్స రంగాల్లో విశ్వసనీయ కేంద్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వైద్యులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తల ప్రతిభ ఈ విజయానికి కారణమని తెలిపారు. మెడికల్, ఫార్మా రంగాల్లో ప్రపంచం హైదరాబాద్ వైపు చూస్తోందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. నాణ్యత, భద్రత, పారదర్శకత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, చిన్న నిర్లక్ష్యం కూడా అంతర్జాతీయ స్థాయిలో ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. నకిలీ, నాసిరకం మందులు ప్రజారోగ్యానికి ప్రమాదమని, వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఫార్మా ఎక్స్‌పో వంటి వేదికలు పరిశోధనలు, భాగస్వామ్యాలు, పరిశ్రమ--ప్రభుత్వ సమన్వయానికి దోహదపడాలని సూచించారు. తెలంగాణలో ఫార్మా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.



## కమలం గూటికి మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్..!

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఆమ్ ఆద్మీ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు సామూహికంగా పార్టీని వీడుతుండటం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, రాఘవ్ చద్దాతో సహా మొత్తం ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిణామంతో దేశ రాజధాని రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభలో ఉన్న 10 మంది ఎంపీలలో ఏడుగురు ఇప్పుడు బీజేపీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమయ్యారు. రాఘవ్ చద్దా నేతృత్వంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ ఇప్పటికే బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నేతలను కలిసి సభ్యత్వం తీసుకోగా.. హర్భజన్ సింగ్ సహా మిగిలిన నలుగురు ఎంపీలు త్వరలోనే కాషాయ కండువా కప్పుకోనున్నారు.గత కొంతకాలంగా ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నాయకత్వంతో రాఘవ్ చద్దాకు విభేదాలు నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆప్ ఎంపీలైన సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, స్వాతి మలివాల్, విక్రమ్‌జీత్ సాహ్నీ అందరూ తమ దారిని మార్చుకున్నట్లు స్పష్టం చేశారు. పార్టీలో అంతర్గత పరిస్థితులు సరిగ్గా లేకపోవడమే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది.భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ 2022 మార్చిలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. అప్పట్లో పంజాబ్ నుంచి ఆ పార్టీ హర్భజన్ సింగ్‌ను రాజ్యసభకు పంపింది. అయితే గత కొంతకాలంగా హర్భజన్ సింగ్ రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ.. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో వ్యాఖ్యాతగా బిజీగా ఉన్నారు. పార్టీ మార్పుపై ఆయన సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ.. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందిస్తూ.. భజ్జీ తన ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ బలం గణనీయంగా పడిపోనుంది. 10 మంది సభ్యుల నుంచి కేవలం ముగ్గురు సభ్యులకు ఆ పార్టీ పరిమితం కానుంది. మరోవైపు దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్న ఆప్‌కు ఇది కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడుగురు ఎంపీల రాకతో ఎగువ సభలో బీజేపీ బలం మరింత పెరగనుంది.

# కోహ్లీ-పడిక్కల్ జోరు..

### ఆర్సీబీ అద్భుత విజయం.. సుదర్శన్ శతకం వృథా



**బలగం టీవి, బెంగళూరు**

తమ సొంత మైదానం చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఐపీఎల్ 19వ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన ఆర్సీబీ.. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. గుజరాత్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ బ్యాటర్లు మరో ఓవర్ మిగిలి ఉండగానే ఊదేయడం విశేషం. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది.

**పునాది వేసిన కోహ్లీ, పడిక్కల్**

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆదిలోనే అదృష్టం వరించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను వాషింగ్టన్ సుందర్ నేలపాలు చేయడంతో లభించిన జీవనదానాన్ని కోహ్లీ (81; 2 సిక్సర్లు, 8 ఫోర్లు) పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. మరోవైపు యువ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ (55) కూడా చెలరేగి ఆడటంతో పవర్ ప్లేలోనే ఆర్సీబీ స్కోరు 50 దాటింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పి విజయానికి బలమైన పునాది వేశారు.

విజయానికి చేరువవుతున్న తరుణంలో గుజరాత్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (2/49) తన మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. పడిక్కల్‌ను అవుట్ చేయడమే కాకుండా, జితేశ్ శర్మను కూడా పెవిలియన్ పంపాడు. ఇదే సమయంలో రజత్ పాటిదార్‌ను మానవ్ సుతార్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే, క్రీజులోకి వచ్చిన కృనాల్ పాండ్యా (23 నాటౌట్) ఒత్తిడికి లోనుకాకుండా రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో మెరుపులు మెరిపించి ఆర్సీబీని గెలుపు తీరాలకు చేర్చాడు. టిమ్ డేవిడ్ (10 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు.

**సుదర్శన్ మెరుపు సెంచరీ**

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (100) అద్భుత శతకంతో కదం తొక్కగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32) అతనికి సహకరించాడు. తొలి వికెట్‌కు వీరిద్దరూ 128 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ ఆఖర్లో జేసన్ హోల్డర్ (23 నాటౌట్) కృనాల్ పాండ్యా వేసిన చివరి ఓవర్లో 6, 6, 4తో విరుచుకుపడటంతో గుజరాత్ భారీ స్కోరు సాధించింది. ఆర్సీబీ బౌలర్లలో సిరాజ్, హేజిల్‌వుడ్ చెరో వికెట్ పడగొట్టారు.

**క్విక్ స్కోర్ బోర్డు:**

గుజరాత్ టైటాన్స్: 205/3 (సాయి సుదర్శన్ 100, గిల్ 32)

ఆర్సీబీ: 209/5 (విరాట్ కోహ్లీ 81, పడిక్కల్ 55, కృనాల్ 23లి)

# అందుబాటులోకి కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ...



### ఆయా షేర్

**బలగం టీవి, హైదరాబాద్**

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌తో కీలక పోరుకు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం నిజంగా గుడ్ న్యూసే. నేడు(ఏప్రిల్ 25) రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్ లో తాను బరిలోకి దిగుతున్నానని స్వయంగా ప్యాట్ కమిన్స్ ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు కమిన్ ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు.కమిన్స్ తన ఇన్ స్టాలో పూర్తిస్థాయిలో బౌలింగ్ చేస్తూ కనిపించిన చిత్రాలను పంచుకుంటూ, "చాలా కాలం తర్వాత వస్తున్నాను, రేపు మళ్లీ మైదానంలోకి దిగడానికి ఆతృతగా ఉన్నాను," అని రాశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా 'వస్తున్నాడు' అంటూ ఎక్స్ వేదికగా కమిన్స్ ఫోటోను షేర్ చేసింది. ఈ సీజన్‌లో తొలి ఏడు మ్యాచ్‌లకు దూరమయ్యాక అతని ఈ ఉత్సాహం స్పష్టమైంది. అతని జట్టు సహచరుడు ట్రావిస్ హెడ్ "ఈ ఏఐ చిత్రాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించాడు.కమిన్స్ లేకపోవడంతో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్‌కు ఐపీఎల్ కెప్టెన్‌గా నాయకత్వం వహించాడు. కాగా, గతేడాది జులై నుంచి వెన్ను గాయంతో బాధపడుతున్న ఈ ఆస్ట్రేలియా ఆటగాడు టీ20 ప్రపంచ కప్‌కు దూరమయ్యాడు. ఆ తర్వాత డిసెంబర్‌లో ఒకే యాషెస్ టెస్టులో మాత్రమే కనిపించాడు. ప్యాట్ కమిన్స్ పేస్ బౌలింగ్, నాయకత్వ సామర్థ్యాలకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా, ఈ సుదీర్ఘ విరామం జాతీయ జట్టుకూ, ఫ్రాంచైజీకి ఆందోళన కలిగించింది. మార్చి 27న జట్టుతో చేరినప్పటికీ.. ఏప్రిల్ 4న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ తర్వాత చివరి వైద్య పరీక్షల కోసం స్వదేశం వెళ్ళాడు. ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షను పూర్తి చేసుకుని, ఇప్పుడు సన్‌రైజర్స్ తరపున తిరిగి రంగప్రవేశం చేస్తున్నాడు.సన్‌రైజర్స్ ప్రారంభంలో మొదటి 4 మ్యాచ్‌లలో మూడు ఓడిపోయి.. అనంతరం వరుసగా 3 విజయాలతో పుంజుకున్నారు. అంటే 7 మ్యాచ్ లలో 4 గెలిచి 8 పాయింట్లు, ం0.820 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లోకి దూసుకెళ్లారు.ఢిల్లీ క్యాపిటల్స్‌పై సాధించిన 47 పరుగుల తేడాతో విజయం తర్వాత సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లోకి వస్తోంది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో అభిషేక్ శర్మ అజేయంగా 135 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయ ఉత్సాహంలో వారు రియాన్ పరాగ్ నాయకత్వంలోని రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కోనున్నారు.



## ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన సన్ రైజర్స్

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సగం దశను పూర్తి చేసుకుంది. రెండో దశ మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. దాంతో లీగ్ మరింత రసవత్తరంగా మారనుంది. వారం వారం గడిచే కొద్దీ ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారడం ఖాయం. ప్రస్తుతానికి ప్లే ఆఫ్స్ రేసు అయితే ఆసక్తికరంగా మారింది. పంజాబ్ కింగ్స్ ఆడిన 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. ఒక రద్దుతో 11 పాయింట్లతో లీగ్ టేబుల్లో టాప్ ప్లేస్‌లో ఉంది. ఇక రాజస్థాన్ రాయల్స్ 7 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. రెండు ఓటములతో 10 పాయింట్లతో రెండో స్థానంలో.. ఆర్సీబీ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. రెండు ఓటములతో 8 పాయింట్లతో మూడో స్థానంలో.. సన్ రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 ఓటములతో 8 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. అయితే ఈ నాలుగు జట్లే ప్లే ఆఫ్స్‌కు చేరతాయనే గ్యారెంటీ లేదు. ప్రస్తుతానికి 10 జట్లకు కూడా ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉన్నాయి. అయితే కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లు ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం 6 గెలవాలి. ప్రస్తుతానికి ఈ మూడు జట్లు ప్లే ఆఫ్స్ చేరడం చాలా కష్టం. ఇక పంజాబ్ కింగ్స్ మిగిలి ఉన్న 8 మ్యాచ్‌ల్లో 3 మ్యాచ్‌ల్లో గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే ప్లే ఆఫ్స్ ఊరిస్తోంది. ఆరంభంలో ఓటములతో సీజన్‌ను ఆరంభించినా.. హ్యాట్రిక్ విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.సన్ రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతానికి 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 పరాజయాలతో 8 పాయింట్లతో లీగ్ టేబుల్లో 4వ స్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌లతో ప్లే ఆఫ్స్‌కు గట్టి పోటీ ఉంది. పంజాబ్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, ఆర్సీబీ జట్లు టాప్3లో వెళ్లినా.. నాలుగో స్థానం కోసం సన్ రైజర్స్, చెన్నై, గుజరాత్, ఢిల్లీ జట్ల మధ్య గట్టి పోటీ అయితే ఉంది. ఇతర జట్లపై ఆధారపడకుండా నేరుగా ప్లే ఆఫ్స్ చేరాలంటే సన్ రైజర్స్ హైదరాబాద్ కనీసం 16 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. అంటే మరో 8 పాయింట్లు కావాలి. అంటే నాలుగు విజయాలు. మిగిలి ఉన్న 7 మ్యాచ్‌ల్లో కనీసం 4 మ్యాచ్‌ల్లో నెగ్గితేనే ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది. 5 లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో గెలిస్తే టాప్ 2లో నిలుస్తుంది.అలా కాకుండా 7 మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గితే మాత్రం అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్ చేరాలంటే టాప్ 2లో నిలిచిన జట్లు డామినేషన్ చూపించాలి. అదే సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ నెట్ రన్ రేట్ కూడా బాగుండాలి. కానీ, ఇది చాలా కష్టం. సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ చేరాలంటే 4 మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్ (ఏప్రిల్ 26న), ముంబై ఇండియన్స్ (ఏప్రిల్ 29న), కేకేఆర్ (మే 3న), పంజాబ్ కింగ్స్ (మే 6న), గుజరాత్ టైటాన్స్ (మే 12న), చెన్నై సూపర్ కింగ్స్ (మే 18న), ఆర్సీబీ (మే 22న) ఆడనుంది. కేకేఆర్, పంజాబ్ కింగ్స్, ఆర్సీబీలతో జరిగే మ్యాచ్‌లను ఉప్పల్ వేదికగా ఆడనుంది.

## అభిమానులతో సచిన్ బర్త్ డే సెలబ్రేషన్స్


**బలగం టీవి, హైదరాబాద్**





భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ శుక్రవారం (ఏప్రిల్ 24) 53వ పుట్టినరోజు జరుపుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఆయన నివాసం వద్దకు పెద్ద ఎత్తున అభిమానులు చేరుకున్నారు. సచిన్?కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానుల సమక్షంలో సచిన్ సచిన్ కేక్ కట్ చేశాడు. ఈ వేడుకలో ఆయన సతీమణి అంజలి కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సచిన్ వీరాభిమాని సుదీర్ కూడా హాజరయ్యారు. మరోవైపు, సోషల్ మీడియాలో సచిన్?కు బర్త్? విషెస్ వెల్లువెత్తాయి. ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రస్తుత, మాజీ క్రికెటర్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సచిన్ కుమారుడు అర్జున్ తెండుల్కర్ తన తండ్రికి శుభాకాంక్షలు చెప్పాడు. అయితే ప్రస్తుతం అర్జున్ ఐపీఎల్ ఆడుతున్నాడు. అతడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుతో ఉన్నాడు. దీంతో తండ్రిని స్వయంగా కలువలేకపోయాడు. అందుకే ఆన్‌లైన్‌లోనే తండ్రికి శుభాకాంక్షలు చెప్పాడు. ఈ వీడియోను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసింది.

# రిటైర్మెంట్‌తో షాకిచ్చిన సమిత్ పటేల్





**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లాండ్ వెటరన్ క్రికెటర్ సమిత్ పటేల్ తన సుదీర్ఘమైన కౌంటీ క్రికెట్ ప్రయాణానికి వీడ్కోలు పలికాడు. గోవాలో జరిగిన వరల్డ్ లెజెండ్స్ ప్రో టీ20 లీగ్‌లో పాల్గొనడమే ఆయన కెరీర్‌కు శాపంగా మారింది. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిబంధనల ప్రకారం, అనుమతి లేని లీగ్‌లలో ఆడే ఆటగాళ్లు ఏడాది పాటు ఇంగ్లీష్ దేశీయ క్రికెట్‌కు అనర్హులు. ఈ నిబంధన కారణంగా సమిత్ పటేల్‌పై 12 నెలల నిషేధం విధించడంతో, ఆయన ఇక ఆడే అవకాశం లేక రిటైర్మెంట్ ప్రకటించక తప్పలేదు. సమిత్ పటేల్ 2008 నుంచి 2015 మధ్య కాలంలో ఇంగ్లాండ్ తరపున 60 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో కంటే కౌంటీ క్రికెట్‌లో ఆయన ఒక దిగ్గజంగా ఎదిగాడు. నాటింగ్‌హామ్‌షైర్ క్లబ్ తరపున దాదాపు 22 ఏళ్ల పాటు సేవలందించాడు. తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లు కలిపి 25,000 పైగా పరుగులు సాధించడమే కాకుండా, 800 పైగా వికెట్లు తీసి అత్యుత్తమ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ది హండ్రెడ్ వంటి ప్రతిష్టాత్మక లీగ్‌లలో కూడా ఆయన తన ముద్ర వేశాడు.తన రిటైర్మెంట్ గురించి సమిత్ పటేల్ మాట్లాడుతూ, లీగ్‌లో ఆడితే ఎదురయ్యే పరిణామాల గురించి స్పష్టత ఉంటే తాను ఆ నిర్ణయం తీసుకునేవాడిని కాదని పేర్కొన్నాడు. వచ్చే సీజన్ కోసం కొన్ని కౌంటీ జట్లతో చర్చలు జరుగుతున్నాయని, కానీ ఈ నిషేధం తన అవకాశాలను దెబ్బతీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే, కేవలం ఇంగ్లాండ్ దేశీయ క్రికెట్‌కు మాత్రమే స్వస్తి పలుకుతున్నానని, ప్రపంచవ్యాప్తంగా జరిగే ఇతర ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆటగాడిగా కొనసాగుతానని ఆయన స్పష్టం చేశాడు.సమిత్ పటేల్ వీడ్కోలు సందర్భంగా నాటింగ్‌హామ్‌షైర్ క్లబ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. క్లబ్ డైరెక్టర్ మిక్ నెవెల్ మాట్లాడుతూ, పటేల్ కేవలం ఒక ఆటగాడు మాత్రమే కాదని, క్లబ్ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేసిన యోధుడని కొనియాడాడు. 22 ఏళ్ల పాటు ఆయన చూపిన అంకితభావం, గెలవాలనే పట్టుదల ఎంతో మంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాడు. కేవలం సమిత్ పటేల్ మాత్రమే కాకుండా, ఆస్ట్రేలియా ఆటగాడు పీటర్ సిడిల్ కూడా ఇదే లీగ్‌లో ఆడినందుకు నిషేధానికి గురవ్వడం గమనార్హం.

# ఐపీఎల్‌లోకి పాకిస్థాన్ మూలాలున్న ప్లేయర్

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కీలక మార్పు జరిగింది. ఇంగ్లాండ్ ఓపెనింగ్ బ్యాటర్ బెన్ డకెట్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. దీంతో అతడి రిప్లేస్‌మెంట్‌ను ఢిల్లీ ఫ్రాంచైజీ తాజాగా అధికారికంగా ప్రకటించింది. డకెట్ స్థానంలో ఇంగ్లిష్ లెగ్– స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. కాగా, రెహాన్ రూ. 75 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్?తో చేరాడు. గతేడాది దుబాయ్ వేదికగా డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో బెన్ డకెట్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్‌లో డకెట్‌కు ఇది మొదటి అవకాశం. కానీ అతను తన అంతర్జాతీయ కెరీర్, టెస్ట్ ఫామ్‌ను మెరుగుపరుచుకోవడానికి ఐపీఎల్‌లో ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. ఈ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు చివరి నిమిషంలో డకెట్ వెల్లడించాడు. దీంతో బీసీసీఐ అతడిపై రెండేళ్ల పాటు ఐపీఎల్ నుంచి నిషేధం విధించింది.21 ఏళ్ల రెహాన్ అహ్మద్ లెగ్ స్పిన్నర్. అతను ఇంగ్లాండ్ జాతీయ జట్టు తరపున 5 టెస్టులు, 9 వన్డేలు, 13 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అతను ఇప్పటివరకు మొత్తం అంతర్జాతీయ కెరీర్?లో 49 వికెట్లు పడగొట్టాడు. అతడు బౌలింగ్?తోపాటు జట్టుకు అవసరమైనప్పుడు బ్యాటింగ్ కూడా చేయగలడు. అయితే రెహాన్ కెరీర్ పరంగా ఇంగ్లాండ్? జాతీయ జట్టుకు ఆడుతున్నప్పటికీ అతడికి మన దాయాది దేశం పాకిస్థాన్‌తో ఒక ప్రత్యేక అనుబంధం ఉంది. పాకిస్థాన్ మూలాలున్న కుటుంబంలో రెహాన్ జన్మించాడు. అతడి తండ్రి నయీమ్ అహ్మద్ పాకిస్థాన్‌లో జన్మించారు. నయీమ్ కూడా యంగ్ ఏజ్?లో ఒక క్రికెటర్. కానీ, జీవితంలో ఎదుగుదల కోసం అతను 2001లో ఇంగ్లాండ్‌కు వలస వెళ్లారు. అక్కడ టాక్సీ డ్రైవర్‌గా పనిచేశారు. ఇక ఆయన పాకిస్థాన్‌కే చెందిన ముస్రత్ హుస్సేన్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమె కూడా పెళ్లి తర్వాత నాటింగమ్‌షైర్‌కు షిఫ్ట్ అయ్యారు. ఈ దంపతులు అక్కడే స్థిరపడ్డారు. వీళ్లకు 2004లో రెహాన్ ఇంగ్లాండ్‌లోని నాటింగ్‌హామ్‌లో జన్మించాడు.క్రికెట్?లో తీవ్రమైన పోటీ ఉండే ఇంగ్లాండ్‌లో రెహాన్ 18ఏళ్లకే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతడు 2022లో తొలి మ్యాచ్ ఆడాడు. అలాగే ఇంగ్లాండ్ తరపున టెస్టుల్లో అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కులలో రెహాన్ ఒకడు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే 2022లో అతడు పాకిస్థాన్‌పైనే అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్?లోనే అదిరే ప్రదర్శనతో సత్తా చాటాడు.పాకిస్థాన్?తో ఆ మ్యాచ్?లో తొలి ఇన్నింగ్స్?లో సౌద్ షకీల్, ఫహీమ్ అష్రఫ్ వికెట్లు పడగొట్టాడు. ఇక రెండో ఇన్నింగ్స్?లో పాకిస్థాన్ పతనం శాసించాడు. తన స్పిన్?తో పాక్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఏకంగా ఐదు వికెట్లతో ఔరా అనిపించాడు. 18ఏళ్ల వయసు, అదీనూ తొలి మ్యాచ్‌లోనే డ్రీమ్ డెబ్యూ అనేట్లు ఆడాడు. రెండో ఇన్నింగ్స్?లో బాబర్ అజామ్, సౌద్ షకీల్, రిజ్వాన్, సల్మాన్ అఘా, మహ్మద్ వాసిమ్?లను పెవిలియన్?కు పంపించాడు. అలా తొలి మ్యాచ్?లోనే 7 వికెట్లు పడగొట్టాడు.



## తల్లి మరణించిన బాధలోనూ మ్యాచ్ ఆడిన ముకేశ్ చౌదరి

**బలగం టీవి, హైదరాబాద్**

ముంబయి ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ భారీ విజయం సాధించింది. వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో 103 పరుగుల తేడాతో సీఎస్కే నెగ్గింది. అయితే ఈ మ్యాచ్?లో సెంచరీ బాదిన సంజు శాంసన్‌తోపాటు బౌలర్ ముకేశ్ చౌదరి డెడికేషన్? పట్ల ప్రశంసలు కురుస్తున్నాయి. తన తల్లి మరణించిన రెండు రోజులకే బరిలోకి దిగడంపై ముకేశ్?ను విశ్లేషకులు మెచ్చుకుంటున్నారు. దీంతో మ్యాచ్?లో ముకేశ్ స్పెషల్ అట్రాక్షన్?గా మారాడు.ఈ మంగళవారం ముకేశ్ చౌదరి తల్లి దీర్ఘకాలిక అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ సమయంలో అతడు హైదరాబాద్?లో సన్?రైజర్స్?తో మ్యాచ్? ఆడుతున్నాడు. ఈ వార్త అందగానే ముకేశ్ మ్యాచ్ అనంతరం హుటాహుటిన తన సొంత గ్రామం రాజస్థాన్‌లోని భిల్వారాకు వెళ్లాడు. అక్కడ బుధవారం తల్లి అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తి చేసుకొని అదే రోజు ముంబయితో మ్యాచ్?కు ముందు చెన్నై జట్టుతో కలిశాడు. తల్లి మరణించిన బాధలోనూ జట్టు అవసరాల కోసం వెంటనే బరిలోకి దిగడం అందర్నీ కలచివేసింది.ముకేశ్?కు ముంబయితో మ్యాచ్?లో తుదిజట్టులో చోటు దక్కింది. ఇక దుఃఖంలో ఉన్న ముకేశ్ చౌదరి ఆ ప్రభావాన్ని తన ఆటపై పడనివ్వలేదు. తొలుత బ్యాటింగ్?లో 7 పరుగులు చేశాడు. అనంతరం బౌలింగ్?లో సత్తా చాటాడు. తన తొలి ఓవర్ ఐదో బంతికే ప్రమాదకరమైన క్వింటన్ డికాక్ వికెట్ పడగొట్టాడు. ఈ వికెట్? తీసినప్పుడు ముకేశ్ ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. ఆ సమయంలో అతడు కాస్త ఎమోషనల్ అయ్యాడు. నిశ్శబ్దంగా మైదానంలోనే నిలబడ్డాడు. ఆకాశం వైపునకు వేలు చూపిస్తూ 'అమ్మా, ఇది నీ కోసమే' అన్నట్లుగా ఈ వికెట్?ను తన తల్లికి అంకితం ఇచ్చాడు. మ్యాచ్? అనంతరం చెన్నై కెప్టెన్ రుతురాజ్ వ్యాఖ్యలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ విజయం ముకేశ్?కు అంకితం ఇస్తున్నట్లు చెప్పాడు. అటు సీఎస్కే ప్లేయర్లు కూడా ముకేశ్ తల్లికి నివాళిగా ఈ మ్యాచ్?లో నల్ల ఆర్మ్ బ్యాండ్?లు ధరించి బరిలోకి దిగారు. మాజీ క్రికెటర్ అశ్విన్ దీనిపై స్పందించాడు. తల్లి లేని లోటు ఎప్పటికీ మనకు తెలుస్తుందని, తల్లిదండ్రుల ప్రేమను ఈ ప్రపంచంలో మరెవరూ భర్తీ చేయలేరని అన్నాడు. తన ఓ పాడ్?కాస్ట్?లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ముకేశ్? తన తల్లిని కోల్పోయాడు. ఆ దుఃఖం నుంచి కోలుకోవడానికి అతనికి కొంత సమయం కావాలి. అయితే ఇలాంటివి జరిగిన తర్వాత కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాలని కొందరు అంటారు. మరికొందరు బయటకు వెళ్లి ఆడాలని చెబుతారు. జనాలు ఎప్పుడూ ఏదో ఒకటి అంటూనే ఉంటారు' 'మన సమాజం ఏ స్థాయికి దిగజారిందో నాకు అర్థం కావడం లేదు. అయితే ఇవన్నీ ఉన్నప్పటికీ, అతను మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ పరిస్థితుల్లో అతడు మ్యాచ్? ఆడాలనే తన తండ్రి, బంధువులు కోరుకుని ఉంటారని నేను కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే అవకాశాలు మళ్లీ ఎప్పుడు వస్తాయో ఎవరికీ తెలియదు. ఈ రోజు అతను ఆడిన తీరు, బౌలింగ్ చేసిన విధానం, అతడు చూపించిన స్ఫూర్తిని ప్రశంసిస్తున్నా. నాలుగు ఓవర్లలో 30 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు' 'అయితే నిజంగా ముకేశ్ ఈ మ్యాచ్?లో మరిన్ని వికెట్లు తీయాలని నేను దేవుడిని ప్రార్థించాను. మనం ఏ వయసులో ఉన్నా అమ్మ అమ్మనే. ఆమె లేని లోటు ఎప్పటికీ మనకు తెలుస్తుంది. తల్లిదండ్రుల ప్రేమను ఈ ప్రపంచంలో మరెవరూ భర్తీ చేయలేరు' అని అశ్విని అన్నాడు.

# సితార పిక్చర్స్‌లో నితిన్




యంగ్ హీరో నితిన్ వరుస ప్లాపులతో బాగా వెనుకబడిపోయాడు. బీష్మ తర్వాత సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న నితిన్ మరొక సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా సోము, నర్రి అనే ఇద్దరు డెబ్యూ డైరెక్టర్లు టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ కొత్త చిత్రం మే 4వ తేదీన లాంఛనంగా ప్రారంభించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మే 6వ తేదీ నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ప్రీ ప్లాన్ షెడ్యూల్ తో కేవలం 55 రోజుల్లోనే ఈ సినిమా పూర్తి షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ టాగంట్‌గా పెట్టుకున్నారు. అంటే దాదాపు రెండు నెలల లోపే షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోతుంది. నితిన్ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో నితిన్ సరసన కథానాయికగా రితికా నాయక్ నటించబోతున్నట్లు సమాచారం. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో మెప్పించిన రితికాకు ఇది నితిన్‌తో ఫస్ట్ మూవీ. ఇక ఈ చిత్రానికి 'విరాటపర్వం' ఫేమ్ సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించబోతున్నారు. మరో ఎన్నాళ్ళుగానో హిట్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నితిన్ కు డెబ్యూ డైరెక్టర్స్ హిట్ ఇస్తారో లేదో చూడాలి.


# దిల్ రాజ్ నిర్మాతగా సల్మాన్ మూవీ

## పూజా కార్యక్రమాలతో ప్రారంభం



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. షూటింగ్ ప్రారంభంపై స్పందించిన సల్మాన్ ఖాన్, ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌ను వచ్చే ఏడాది ఈద్ పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నిరాశ చెందవద్దు. మీ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది అని అభిమానులకు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఈద్ సందర్భంగా ఆయన సినిమాలు విడుదలై భారీ విజయాలు సాధించడం తెలిసిందే. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగు చిత్రసీమలో విజయవంతమైన సినిమాలతో గుర్తింపు పొందిన వంశీ పైడిపల్లి ఈ సినిమాతో హిందీ చిత్రసీమలో అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో కథ సిద్ధం చేసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో, ప్రేక్షకులను ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలతో సినిమా రూపొందనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో, టాలీవుడ్ హిట్ దర్శకుడు కలయికలో వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. ఈద్ విడుదల లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ సినిమా, సల్మాన్ ఖాన్ కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. కాగా, గత కొన్నాళ్లుగా సల్మాన్ ఖాన్ హిట్స్ అందించలేక నిరాశలో ఉన్నారు.టాలీవుడ్ డైరెక్టర్‌తో చేస్తున్న సినిమాతో అయిన మంచి హిట్ అందుకుంటాడా అనేది చూడాలి.

# లీగల్ వివాదాల్లో దృశ్యం-3



## ఆలస్యం కానున్న విడుదల

మలయాళ వెండితెరపై సంచలనం సృష్టించిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సిరీస్ సంచలనాలు సృష్టించింది. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడవ భాగం 'దృశ్యం 3' కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చట్టపరమైన చిక్కుల్లో పడటం ఇప్పుడు కేరళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ గతంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు, డిజిటల్ సంస్థకు అనుకూలంగా కీలక తీర్పునిచ్చింది. మే 15వ తేదీ వరకు 'దృశ్యం 3' సినిమాకు సంబంధించి ఎలాంటి కొత్త డీల్స్ క్షి లేదా ఇతర డిజిటల్ హక్కులు కుదుర్చుకోకూడదని నిర్మాతలకు స్టే ఆర్డర్ జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర యూనిట్ డైలమాలో పడింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సమస్య త్వరగా కొలిక్కి రాకపోతే మే 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు మోహన్ లాల్ అభిమానులు మాత్రం ఈ వివాదం త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.


# మరోమారు వాయిదా దిశగా పెద్ది

## జూన్ 4 నుంచి 24కు మారినట్లు వార్తలు

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు



చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా




మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హై-వోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌న్ని గ్రైల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

# క్రైమ్ థ్రిల్లర్ కథ.. పరమపదసోపానం

అర్జున్ అంబటి, జెనిఫర్ ఇమాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు నాగ శివ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన ఈ యాక్షన్ రివెంజ్ డ్రామా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఏ మేరకు ఆకట్టుకుందో విశ్లేషణలోకి వెళ్లి తెలుసుకుందాం. హెల్త్ కమిషనర్ సత్యప్రకాష్ (కోటేశ్వరరావు) దారుణ హత్యతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. ఈ హైప్రొ÷ల్ కేసును ఛేదించే బాధ్యతను అశ్వద్ధామ (అజయ్ రత్నం) స్వీకరిస్తాడు. అయితే ఈ కేసులో ప్రధాన సాక్షిగా అర్జున్ (అర్జున్ అంబటి) అనే గేమింగ్ డిజైనర్‌ను గుర్తిస్తారు. అయితే, అర్జున్ ఓ మానసిక సమస్యతో బాధపడుతుంటాడు. తనను ఎవరో చంపాలని ప్రయత్నిస్తున్నారనే భయంలో ఉన్న అర్జున్‌కు రక్షణగా క్రైమ్ బ్రాంచ్ సీఐ నేహా (జెనిఫర్ ఇమాన్యుయేల్) బృందాన్ని నియమిస్తారు. మరోవైపు వరుసగా ప్రభుత్వ అధికారులు హత్యకు గురవుతుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? హెల్త్ మినిస్టర్ పురుషోత్తం రెడ్డి (పిల్లా ప్రసాద్) పాత్ర ఏమిటి? అసలు 'పాలకడలి' అనే గ్రామానికి, ఈ కథకు ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. దర్శకుడు నాగ శివ తన తొలి ప్రయత్నంలోనే ఒక బలమైన సామాజికాంశాన్ని కమర్షియల్ హంగులతో




జోడించి తెరకెక్కించడంలో విజయం సాధించారు. మొదటి భాగం వరుస హత్యలు, సస్పెన్స్ అంశాలతో పాటు మెహబూబ్ బాషా కామెడీతో సరదాగా సాగిపోతుంది. ఇక ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండాఫ్ పై ఆసక్తిని పెంచుతుంది. రెండవ సగం కథ వేగం పుంజుకుంటుంది. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మరియు క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. కేవలం 1 గంటా 47 నిమిషాల నిడివి ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. అర్జున్ అంబటి కథకు సరిగ్గా సరిపోయాడు. జెనిఫర్ ఇమాన్యుయేల్ పోలీస్ ఆఫీసర్‌గా ఒక పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించింది. అజయ్ రత్నం చాలా కాలం తర్వాత ఒక బలమైన పాత్రలో కనిపించగా, విలన్ పాత్రలో పిల్లా ప్రసాద్ తన అనుభవాన్ని ప్రదర్శించారు. మెహబూబ్ బాషా కామెడీ రిలీఫ్ ఇచ్చింది.

# యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్న దీపిక

షారుక్‌ఖాన్, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమా లో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ట్ సన్నివేశాన్ని కూడా సిద్దార్థ్ ఎలాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఈట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఈ ట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.

